సిరిసిల్లలోని బతుకమ్మ ఘాట్ వద్ద ప్రజలతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్

గ్యారెంటీ కాదు గారడీల ప్రభుత్వం

- కాంగ్రెస్‌వన్నీ ఆచరణ సాధ్యంకాని హామీలే
- ప్రజలన్ని నమ్మించి మోసం చేస్తోంది
- ఈ ఎన్నికలు నిజానికి అబద్ధానికి మధ్య జరుగుతున్న యుద్ధం
- కరీంనగర్ సెగ్మెంట్‌కు ఎంపీగా బండి నయాపైసా తెచ్చాడా?
- బడాయి మాటలు తప్ప ఆయనతో ఒరిగేదేం లేదు
- నన్ను గెలిపిస్తే ప్రశ్నించే గొంతునై పనిచేస్తా
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్
- సిరిసిల్ల మార్నింగ్ వాక్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): ' కాంగ్రెస్ చెప్పేవన్నీ అబద్ధాలే. ఆచరణ సాధ్యంకాని వాగ్దానాలే. అలవికాని హామీలతో ప్రజలను మోసం చేసింది. ఇది గ్యారెంటీ ప్రభుత్వం కాదు. గారడీల ప్రభుత్వమని' కరీంనగర్ లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి బీ వినోద్‌కుమార్ విమర్శించారు. హామీలు ఇచ్చుడే తప్ప.. అమలు చేసేది మాత్రం లేదని ధ్వజమెత్తారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, బతుకమ్మ ఘాట్ వద్ద మార్నింగ్‌వాక్‌లో పాల్గొని వాకర్స్, మార్కెట్‌లో రైతులు, కూలీలు, ఇలా ప్రతిఒక్కరిని కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో కేటీఆర్ మంత్రిగా సిరిసిల్లను బాగా అభివృద్ధిని చేశారంటూ రైతులు, వాకర్లు తమ అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హామీలు ఇచ్చి ఎగ్గొట్టడం కాంగ్రెస్‌కు కొత్తేమీ కాదన్నారు. ఈ పార్లమెంట్ ఎన్నికలు నిజానికి, అబద్ధానికి మధ్య జరుగుతున్న యుద్ధమని పేర్కొన్నారు. తనను గెలిపిస్తే ప్రజాసమస్యలపై, తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలపై ప్రశ్నించే గొంతుకనవుతానని చెప్పారు. 2019ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ తాను ప్రజల మధ్యనే ఉన్నానన్నారు. 1952లో బద్దం ఎల్లారెడ్డి ఎంపీగా ఉన్నప్పటి నుంచి 2014వరకు ఎందరో ఎంపీలు వచ్చినప్పటికీ కరీంనగర్ రైల్వేలైన్ ముందుకు సాగలేదన్నారు. 2014లో తాను ఎంపీగా గెలిచిన తర్వాతనే కొత్తపల్లి, మనోహరాబాద్ రైల్వే లైన్ మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం సిద్దిపేట వరకు రైలు నడుస్తున్నదని, మరో ఏడాదిలోగా సిరిసిల్లకు వస్తుందన్నారు. ఉమ్మడి కరీంనగర్ చుట్టూ జాతీయ రహదారులు మంజూరు చేయించడంతో పాటు వాటి నిర్మాణాలను పూర్తి చేసేలా కృషి చేసినట్లు చెప్పారు. తెలంగాణలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాలని పార్లమెంట్‌లో గొంతు వినిపించానన్నారు. భవిష్యత్‌లో భవ్యమందిరం గా కొండగట్టు ఆలయం రూపుదిద్దుకుని, అధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతుందన్నారు. కొండగట్టు క్షేత్రానికి భక్తుల సంఖ్య పెరుగుతున్నదన్నారు. ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు 332ఎకరాల ఫారెస్ట్ భూ మిని కేటాయించినట్లు తెలిపారు.

ఎంపీగా బండి చేసిందేమిటి..?

కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్ చేసిందేమిటని? వినోద్ ప్రశ్నించారు. ఒక్క గుడి, బడికైనా నిధులు తెచ్చాడా ? అన్ని నిలదీశారు. ఐదేళ్లలో వేములవాడ, కొండగట్టు ఆలయాలకు ఐదు రూపాయలు కూడా తేలేదని విమర్శించారు. 2005లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్రంలో ఉపాధిహామీ చట్టం తెచ్చిందని, అయితే ఉపాధిహామీ, అంగన్‌వాడీలకు, ఇతర కేంద్ర ప్రభుత్వాలకు నిధులు తెచ్చానంటూ బండి బడాయి మాటలు మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. అభివృద్ధి పనులు చేతగాక, కేంద్రం నుంచి నిధులు తెచ్చే దమ్ములేక బడాయి మాటలు మాట్లాడుతున్నాడని విమర్శించారు. కరీంనగర్‌కు మంజూరైన ట్రిబుల్ ఐటీనీ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఇతర రాష్ట్రాలకు తరలిస్తే చేతులు ముడుచుకు కూర్చున్న బండికి, ఈ ప్రాంత విద్యార్థులు గుర్తుకు రాలేదా? అని మండిపడ్డారు. ఎమ్మెల్యేగా ఓడిపోతే ఎంపీగా పోటీ చేయడం ఆయనకు అలవాటైందని, కరీంనగర్ ఏమైనా పునరావాస కేంద్రమా..? అంటూ ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా, పట్టణాధ్యక్షులు తోట ఆగయ్య, జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, టీఎస్‌టీపీడీసీ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కౌన్సిలర్లు కల్లూరి రాజు, పట్టణ కార్యదర్శి మ్యాన రవి, నాయకులు దార్ల సందీప్, అక్కరాజు శ్రీనివాస్, బొల్లి రామ్మోహన్, అగ్గి రాములు, ఎరవెల్లి రమణారావు, జక్కుల నాగరాజు, సికిందర్, మనోజ్, సాయి కృష్ణ, హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

వినోద్‌కుమార్ పరామర్శ

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 8: సిరిసిల్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గన్నమనేని శ్రీనివాస్‌రావు తల్లి ఇటీవల మరణించగా, సోమవారం బాధిత కుటుంబాన్ని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.

నేటి నుంచి రాములోరి నవరాత్రోత్సవాలు షురూ

- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు
- ఆలయ ఈవో కృష్ణప్రసాద్

ఈవో కృష్ణప్రసాద్

వేములవాడ టౌన్, ఏప్రిల్ 8: వేములవాడ రాజన్న ఆలయంలో నేటి ఉగాది పర్వదినం నుంచి శ్రీ రామనవమి ఉత్సవాలు ప్రారంభమవుతున్నాయని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ ఈవో కృష్ణప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్రోధినామ సంవత్సర ఉగాది పర్వదినం మంగళవారం నుంచి ఈ నెల 17వరకు శ్రీరామనవమి నవరాత్రోత్సవాలు ఘనంగా జరుగుతాయని తెలిపారు. శ్రీ రామ కల్యాణోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నామన్నారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం ఆలయ ప్రాంగణంలో గల ఓపెన్‌స్లాబ్‌పై పంచాంగ శ్రవణం ఉంటుందని స్థానాచార్యుడు అప్పాల భీమాశంకర్ తెలిపారు.

2కే రన్‌లో పాల్గొన్న అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి

ఓటుహక్కు వినియోగించుకోవాలి

- అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి
- సిరిసిల్లలో స్వీప్ ఆధ్వర్యంలో 2కే రన్
- ఉత్సాహంగా పాల్గొన్న పట్టణ ప్రజలు

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 8: అర్హులందరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని సిరిసిల్ల అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ పూజారి గౌతమి పిలుపునిచ్చారు. లోక్ సభ ఎన్నికల నేపథ్యంలో ఓటుహక్కుపై అవగాహనలో భాగంగా స్వీప్ (సిస్టమెటిక్ ఓటర్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్ట్రోరల్ పార్టిసిపేషన్) ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో సోమవారం 'ఐ ఓట్ ఫర్ ష్యూర్' పేరుతో 2కే రన్ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి బతుకమ్మ చౌరస్తా వరకు జరిగిన 2కే రన్‌ను అదనపు కలెక్టర్ ప్రారంభించి, మాట్లాడారు. ఓటుహక్కును అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రలోభాలకు లోనుకాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలన్నారు. వోటర్ హెల్ప్ లైన్ యాప్ (వీహెచ్ఎ)లో అందుబాటులో ఉన్న సేవలు, ఓటుహక్కు నమోదుకు అర్హత వయసు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఓటుహక్కు నమోదు చేసుకొనే విధానంపై ఆర్డీవో రమేశ్ అవగాహన కల్పించారు. 18ఏండ్లు నిండిన వారు ఓటుహక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్ షరీఫ్ మోహినొద్దీన్, మున్సిపల్ కమిషనర్ లావణ్య, స్వీప్ నోడల్ అధికారి, అదనపు డీఆర్డీవో గొట్టె శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేతన్నలపై కక్ష కట్టద్దు

- కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్
- సిరిసిల్లలో లక్ష్మీనారాయణ కుటుంబానికి పరామర్శ

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 8: సిరిసిల్లలోని నేతకార్మికులపై ప్రభుత్వం కక్ష కట్టవద్దని, వెంటనే బకాయిలు చెల్లించి ఆదుకోవాలని, పరిశ్రమకు ఆర్డర్లు ఇవ్వాలని కరీంనగర్ లోక్ సభ అభ్యర్థి బీ వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సిరిసిల్లలోని రాజీవ్‌నగర్‌లో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న నేతకార్మికుడు సిరిపురం లక్ష్మీనారాయణ కుటుంబాన్ని సోమవారం పరామర్శించారు. లక్ష్మీనారాయణ కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ₹50వేల ఆర్థిక సాయం అందించి భరోసానిచ్చారు. అనంతరం ఆయన మాట్లాడారు. సిరిసిల్లలోని నేత కార్మికులు మూడు నెలలుగా పనులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కుటుంబాలను పోషించుకోలేక సతమతమవుతున్నారని వివరించారు. ఈ క్రమంలోనే ఉపాధి కరువై నేత కార్మికుడు లక్ష్మీనారాయణ ఆత్మహత్య చేసుకోవడం కలిచి వేసిందన్నారు. 20 ఏళ్ల కిందట ఇక్కడ నేతకార్మికులు వరుసగా ఆత్మహత్యలు చేసుకుంటే, ఉద్యమసమయంలో కేసీఆర్ ₹50లక్షలు అందించి ఆదుకున్నారని గుర్తు చేశారు. తెలంగాణ రాగానే నేతకార్మికులకు బతుకమ్మ చీరలు, క్రిస్మస్, రంజాన్ సందర్భంగా అందజేసేందుకు వస్త్ర కానుకలు, పిల్లల యూనిఫాం బట్ట తయారీ ఆర్డర్లు అందించి అండగా నిలిచారన్నారు. కార్మికులకు వలస పోకుండా ఇక్కడే పనిచేసుకుని ఉపాధి పొందేలా చూశారన్నారు. కార్మికులకు చేతి నిండా పని, పండుగలకు ప్రభుత్వం తోపా, కానుకలను అందజేసిందన్నారు. వీటితోపాటు వర్కటూ ఓనర్, త్రిఫ్ట్, అప్పారెల్ పార్కు లాంటి పథకాలు పెట్టారన్నారు. నేత కార్మికులపై సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కాంగ్రెస్ ప్రభుత్వం కక్ష కట్టవద్దని, వీరికి చెల్లించాల్సిన బకాయిలు చెల్లించాలని కోరారు. అలాగే కొత్త ఆర్డర్లు ఇవ్వాలని, లేదంటే మళ్లీ సిరిసిల్ల ఉరి సిల్లగా మారే ప్రమాదముందన్నారు. నేతకార్మికులు మనోధైర్యం కోల్పోవద్దని, త్వరలోనే మంచి రోజులు వస్తాయని చెప్పారు. ఆయన వెంట సిరిసిల్ల జడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మాజీ జడ్పీ చైర్ పర్సన్ తుల ఉమ, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, కౌన్సిలర్లు ఓగ్గు ఉమ, బుర్ర లక్ష్మి, ఒగ్గు రాజేశం, గొల్లపల్లి బాలయ్యగౌడ్, బుర్రమల్లికార్జున్, బొల్లి రామ్మోహన్, మాట్ల మధు ఉన్నారు.

లక్ష్మీనారాయణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బీ వినోద్‌కుమార్

'గ్రీవెన్స్ డే'తో సత్వర న్యాయం: ఎస్పీ

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 8: ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించి సత్వర న్యాయం అందించేవిధంగా గ్రీవెన్స్ డే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని ఎస్పీ అఖిల్‌మహాజన్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 3గంటల వరకు ఎస్పీ స్వయంగా బాధితుల నుంచి 16 ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి, బాధితుల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గ్రీవెన్స్ డే ఫిర్యాదులు ఏ మేరకు పరిషారం అయ్యాయో అడిగి తెలుసుకున్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహిస్తూనే నేరస్తులపై కఠిన వైఖరి అవలంబించాలని ఆదేశించారు. ప్రజలు సమస్యలను నేరుగా పోలీస్ అధికారులకు దృష్టికి తీసుకువస్తే సాధ్యమైనంత త్వరగా పరిష్కారం చూపుతామని భరోసానిచ్చారు.

నార్మల్ డెలివరీల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ అనురాగ్ జయంతి
- వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమావేశం

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, ఏప్రిల్ 8: జిల్లాలోని ప్రభుత్వ దవాఖానల్లో నార్మల్ డెలివరీల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ దవాఖానల్లో గర్భిణుల నమోదు, ప్రసవాలు, ఎనీమియా కేసు గుర్తింపు తదితర అంశాలపై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం సమీక్షా సమావేశం కలెక్టర్ నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ దవాఖానల్లో గత నెలలో సిజేరియన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వంద శాతం సిజేరియన్లు చేసే ప్రైవేట్ దవాఖానలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్కారు దవాఖానలో అందుతున్న సేవలు, వసతులపై అవగాహన కల్పించాలని సూచించారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు అందిస్తున్న వైద్య పరీక్షలపై ఆరా తీశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, డీఎంహెచ్‌వో సుమన్‌మోహన్‌రావు, ఆర్ఎంవో సంతోష్, జిల్లా ఉప వైద్యాధికారులు శ్రీరాములు, రజిత, పర్యవేక్షకులు మురళీధర్‌రావు, మహేశ్‌రావు, ప్రోగ్రాం ఆఫీసర్లు నయీంజహా, ఉమా, మెడికల్ ఆఫీసర్లు, పాల్గొన్నారు.

'అమ్మ ఆదర్శ పాఠశాలల'పై సమీక్ష

కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్‌హాల్‌లో నీటి పారుదల, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ, మున్సిపల్, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ అధికారులు, అదనపు కలెక్టర్ పూజారి గౌతమితో కలిసి అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టాల్సిన మరమ్మతు పనులపై కలెక్టర్ అనురాగ్ జయంతి సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అమ్మ ఆదర్శ పాఠశాలల కింద ఎంపికైన పాఠశాలల్లో విద్యుత్, తాగునీటి సరఫరా, టాయిలెట్ల మరమ్మతులను కమిటీ సభ్యులు, స్కూల్ హెచ్ఎం, అధికారులు పరిశీలించాలని సూచించారు. అనంతరం ఆయా పనులను పాఠశాలలు తిరిగి ప్రారంభం అయ్యేలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ పూజారి గౌతమి, జడ్పీసీఈవో ఉమారాణి, టీఎస్ఈడబ్ల్యూఐడీసీ డీఈ అనిత సింగనాథ్, డీఈవో రమేశ్‌కుమార్, డీఆర్డీవో శేషాద్రి, ఇరిగేషన్ ఈఈ అమరేందర్‌రెడ్డి, పీఆర్ ఈఈ సూర్యప్రకాశ్, ఆర్‌అండ్‌బీ ఈఈ శ్యాంసుందర్, మున్సిపల్ కమిషనర్లు లావణ్య, అన్వేష్, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల పని కల్పించాలి: డీఆర్డీవో

ఇల్లంతకుంట: మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న డీఆర్డీవో శేషాద్రి

బోయినపల్లి/ఇల్లంతకుంట, ఏప్రిల్8: ఈజీఎస్ కూలీలకు తప్పనిసరిగా వంద రోజుల ఉపాధి కల్పించాలని, అందుకు అనుగుణంగా పనులు గుర్తించాలని డీఆర్డీవో శేషాద్రి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన బోయినపల్లి, ఇల్లంతకుంట మండల కేంద్రాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఉపాధిహామీ పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏప్రిల్ నుంచి ప్రతి కూలికి ₹250 చెల్లించడానికి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో ఐదువేల కుటుంబాలకు వంద రోజులు పని కల్పించేలా ప్రణాళిక చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి పేద కుటుంబానికి ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సమావేశంలో ఏపీడీ నర్సింహులు, ఎంపీడీవోలు జయశీల, శ్రీనివాసమూర్తి, ఏపీఎంలు సబిత, చంద్రయ్య, ఈసీ అర్షద్, పంచాయతీ కార్యదర్శులు, టెక్నికల్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి వస్త్ర పరిశ్రమ ప్రారంభం

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమను బుధవారం నుంచి పునప్రారంభిస్తున్నట్లు జేఏసీ తెలిపింది. సోమవారం జేఏసీ నాయకులు పంతం రవి, మూషం రమేశ్, మండల సత్యం సిరిసిల్ల పర్యటనకు వచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి చర్చలు జరిపారు. ఈ సం దర్భంగా మండల సత్యం మాట్లాడుతూ, తమ డిమాండ్లను మంత్రి అంగీకరించినట్లు తెలిపారు. పెండింగ్ బకాయిలు దశల వారీ గా విడుదల చేయడంతో పాటు కార్మికులకు మెరుగైన ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో బుధవారం నుంచి సాంచాలను నడపనున్నట్లు వారు తెలిపారు. కార్మికులకు కూలి తగ్గిస్తే ఊరుకునేదిలేదని కార్మిక సంఘం నేత పంతం రవి యజమానులను హెచ్చరించారు.

ఆర్థిక సాయం అందజేత

వేములవాడ రూరల్, ఏప్రిల్ 8: వేములవాడ మండ లం చింతల్‌ఠాణాకు చెందిన బడుగు సునీల్ అనారోగ్యం తో బాధపడుతుండగా వేములవాడ మన చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు రూ.14,600 అందించారు. దాతలు ముందుకు వచ్చి సాయం చేయాలని ట్రస్ట్ సభ్యులు విజ్ఞప్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి సహకరించాలి

చందుర్తి, ఏప్రిల్ 8: మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీపీ బైరగోని లావణ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎజెండా అంశాలను శాఖల వారీగా వివరించగా, గ్రామాల్లోని సమస్యలు, ప్రభుత్వ పథకాలపై వాడివేడిగా చర్చ జరిగింది. ₹2లక్షల రుణమాఫీ, వరి పంటకు అదనంగా ₹500 బోనస్ చెల్లింపుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలంటూ కోఆప్షన్ సభ్యు డు బత్తుల కమలాకర్, ఎంపీటీసీ రమేశ్‌రావు ఆందోళన వ్యక్తం చేశా రు. తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపట్టాలని అధికారులను నిలదీశారు. అర్హులకు గృహజ్యోతి అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇక్కడ జడ్పీటీసీ నాగం కుమార్, ఎంపీడీవో ప్రదీప్, తదితరులు ఉన్నారు.

ఘనంగా ముందస్తు ఉగాది వేడుకలు

రుద్రంగి/ఎల్లారెడ్డిపేట/గంభీరావుపేట/సిరిసిల్ల రూరల్/ఇల్లంతకుంట, ఏప్రిల్ 8: జిల్లాలోని పలు పాఠశాలల్లో సోమవారం ముందస్తుగా ఉగాది వేడుకలు జరుపుకొన్నారు. రుద్రంగిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులు ఉగాది పచ్చడి తయారు చేసి తోటి మిత్రులు, ఉపాధ్యాయులకు పంపిణీ చేశారు. అలాగే ఎల్లారెడ్డిపేట మండలం గుండారంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో క్రోధినామ సంవత్సరం సందర్భంగా విద్యార్థులకు ఉగాది పచ్చడి అందించారు. గంభీరావుపేట మండలంలోని పలు పాఠశాలల్లో వేడుకలు జరుపుకొన్నారు. తంగళ్లపల్లిలోని శుభోదయ పాఠశాలలో విద్యార్థులు ఉగాది అక్షరాల ఆకారంలో నేలపై కూర్చొని శుభాకాంక్షలు తెలిపారు. ఓబులాపూర్‌లోని జడ్పీహెచ్ఎస్‌లో సంబురాలు జరుపుకొన్నారు. ఇల్లంతకుంటలోని శ్రీవాణి పాఠశాలలో వేడుకలు నిర్వహించారు. ఉగాది పర్వదినం విశిష్టతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఇల్లంతకుంట: శ్రీవాణి పాఠశాలలో ఉగాది వేడుకలు

సిరిసిల్ల రూరల్: శుభోదయ పాఠశాలలో ఉగాది ఆకారంలో విద్యార్థులు

అటవీ భూములను సంరక్షించాలి

రుద్రంగి, ఏప్రిల్ 8: ఉమ్మడి మానాల పరిధిలో అటవీ భూములు అక్రమణకు గురికాకుండా సంరక్షించాలని గ్రామ నాయకులు, గ్రామస్తులు సోమవారం డీఎఫ్‌వో బాలమణి, ఎఫ్ఆర్వో వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ వైస్ఎంపీపీ పీసరి భూమయ్య, నాయకులు జక్కు మోహన్, చంద రాజేశం, నాయిని రాజేశం, తూం జలపతి, బాధనవేని రాజా రాం, జూల భూమయ్య, జూల దిలీప్, జక్కుల బ్రహ్మానందం, జలేంధర్, గంగాధర్, మహేశ్ పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుడికి సన్మానం

వేములవాడ, ఏప్రిల్ 8: రాజన్న దర్శనానికి వచ్చిన జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డెపల్లి రామచందర్‌ను పట్టణంలో పలువురు నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం అంబేద్కర్ సంఘం నేతలు ఆయనను సత్కరించారు. ఇక్కడ అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు కుమ్మరి శంకర్, కార్యదర్శి పెంట బాబు, నేతలు పెంట శంకర్, రాములు, పెంట రాజేశం ఉన్నారు.

బీఆర్ఎస్ యువ నేతల శ్రమదానం

గుండారం-మద్దిమల్ల శివారు రోడ్డులో చెట్టును తొలగిస్తున్న యువకులు

కొన్నిరోజుల క్రితం ఈదురుగాలులు, వడగండ్ల వానలతో గుండారం-మద్దిమల్ల శివారులో రోడ్డుకు అడ్డంగా చెట్లు కూలిపడ్డాయి. ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్న దరిమిలా మద్దిమల్లకు చెందిన పలువురు బీఆర్ఎస్ యువజన నాయకులు స్పందించారు. సోమవారం ఉదయమే రోడ్డుకు అడ్డంగా విరిగి పడ్డ చెట్లను గొడ్డళ్లతో నరికివేసి రోడ్డును క్లియర్ చేశారు. ఇక్కడ భూక్యా గజన్, భూక్యా ప్రకాశ్, మాలోత్ అజయ్, మాలోత్ నరేశ్, మాలోత్ విజయ్, తదితరులు ఉన్నారు. – ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 8

రాములోరి కల్యాణానికి విరాళం



కల్యాణోత్సవానికి నగదు అందిస్తున్న కమలాకర్‌రావు

బోయినపల్లి, ఏప్రిల్8: మండల కేంద్రంలో సీతారాముల కల్యాణ మహోత్సవానికి రాజన్న ఆలయ మాజీ చైర్మన్ చెన్నాడి కమలాకర్‌రావు ₹60వేల విరాళాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, నాయకులు సత్తినేని మాధవ్, గుంటి లతాశ్రీ, గుంటి శంకర్, నల్లగొండ అనిల్ కుమార్, బొజ్జ ప్రభాకర్, బోయిని రాజు, దూస కిశోర్, మాడిశెట్టి శ్రీనివాస్, వాసాల శ్రీనివాస్, పురుషోత్తం, శంకర్, మధు ఉన్నారు.

జిజ్ఞాస పోటీల్లో ప్రతిభ

వేములవాడ రూరల్, ఏప్రిల్8: అగ్రహారం డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి జిజ్ఞాస పోటీల్లో ప్రతిభ చాటినట్లు ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్, రసాయనశాస్త్ర విభాగాధిపతి కరుణ పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కళాశాలకు చెందిన రసాయనశాస్త్ర సహాయ ఆచార్యుడు కరుణ పర్యవేక్షణలో విద్యార్థులు సరస్వతి, శివకృష్ణ, కిరణ్, స్వాతిక, భవాని 'ఫిజికో కెమికల్ అండ్ బయలాజికల్ వాటర్ ఎనాలిసిస్- ఈ స్టడీ ఆఫ్ డిస్టిక్ టెక్స్‌టైల్ ఇండస్ట్రీయల్ ఏరియా తెలంగాణ' అనే అంశంపై రూపొందించిన స్టడీ ప్రాజెక్టు ఇటీవల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జిజ్ఞాస సమన్వయకర్త అఫ్సారీ ఉస్మాని, అకాడమిక్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్లు అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

చలివేంద్రాల ఏర్పాటు అభినందనీయం

గాంధీ చౌక్: చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రధాన న్యాయమూర్తి ప్రేమలత

గాంధీ చౌక్, ఏప్రిల్8: కక్షిదారులకు చల్లటి నీటిని అందించడానికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని జిల్లా ప్ర